క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

సీతానగరం: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో శుక్రవారం కొత్త బ్రేకర్లు అమర్చనున్నందున వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో కలగనున్న అంతరాయానికి చింతిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఏఈఈ పి. శశిభూషణరావు అన్నారు. ఈ మేరకు స్థానిక సబ్‌స్టేషన్‌లో బుధవారం విద్యుత్ అంతరాయానికి కారణమైన బ్రేకర్లను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ పాత బ్రేకర్లు తొలగించి కొత్తబ్రేకర్లు అమర్చడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలియజేశారు. అందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలను దత్తత తీసుకోవాలి



పీ-ఫోర్ సర్వేపై శిక్షణ ఇస్తున్న అధికారులు

మక్కువ: దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలను సచివాలయ సిబ్బంది దత్తత తీసుకోవాలని ఎంపీడీవో ఎం.అర్జునరావు కోరారు. ఈ మేరకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పీ ఫోర్ సర్వేపై శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అర్జునరావు మాట్లాడుతూ పేదరిక నిర్మూలన లక్ష్యంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. శిక్షణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని సిబ్బందికి వివరించారు. దారిద్ర్య రేఖకు దిగువనున్న రెండు కుటుంబాలను సచివాలయ సిబ్బంది దత్తత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎస్.సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల వేలం రేపు

సీతానగరం: ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీతానగరం సర్కిల్ కార్యాలయం పరిధిలో వివిధ కేసుల్లో గతంలో పట్టుబడిన ద్విచక్రవాహనాలను ఈ నెల 26న వేలం వేయనున్నట్లు సీఐ డి.పద్మావతి తెలిపారు. పార్వతీపురం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ కార్యాలయం ఆవరణలో వేలం వేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

స్వచ్ఛోత్సవ్.స్వచ్ఛతా 'హి' కార్యక్రమంపై అవగాహన



అపరాధ రుసుం విధించి బిల్లును యజమానికి అందిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ

పాచిపెంట: సాలూరు పురపాలక సంఘం కమిషనర్ రత్నకుమారి ఆదేశాల మేరకు స్వచ్ఛోత్సవ్..స్వచ్ఛతా 'హి' కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలకష్ణ బుధవారం పురపాలక సంఘం పరిధిలో గల వాణిజ్య సముదాయాల్లో పర్యటించారు. స్వచ్ఛత ప్రాముఖ్యత, పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను ఈ సందర్భంగా తెలియజేశారు. అలాగే ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ప్లాస్టిక్ వినియోగిస్తున్న షాపులకు అపరాధ రుసుము విధించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ కార్యదర్శులు, శానిటరీ మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సమస్యలపై పోరాటం



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ మండలశాఖ అధ్యక్షుడు సింహాచలం

వీరఘట్టం: రైతు సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం పోరాడుతోందని ఆ సంఘ మండల అధ్యక్షుడు ఎస్. సింహాచలం అన్నారు. మండలంలోని కడకెల్ల గ్రామంలో బుధవారం ఆయన పర్యటించి, రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శ్రమకు తగ్గ వేతనం రావడం లేదని.. నిత్యావసర సరుకులు, విద్యుత్ చార్జీలు పెరగడంతో జీవనం అతలాకుతలమైందని ఈ సందర్భంగా పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కారానికి సంఘం తరఫున పోరాటం చేస్తామని సింహాచలం చెప్పారు.

ప్రమాదంలో ప్రజారోగ్యం



కొత్తపట్నం బీసీ కాలనీ తాగునీటి బోరు వద్ద కాలువలో నిలిచిన మురుగు



పెదబొండపల్లి కుమ్మరి వీధిలో నీటి నిల్వలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం

- పడకేసిన పారిశుధ్యం
- కాలువల్లో మురుగు నిల్వలతో దోమల బెడద
- రోగాల బారిన పడుతున్న ప్రజలు

పార్వతీపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో అడుగుపెడితే చాలు, ముక్కుపుటాలదిరి మురుగు వాసన ఘాటుగా స్వాగతం పలుకుతుంది. వీధుల్లో ఎక్కడ చూసినా పారేందుకు దారిలేక నిలిచిపోయిన మురుగునీటి కాలువలు, పేరుకుపోయిన చెత్తకుప్పలే దర్శనమిస్తాయి. పార్వతీపురం మండలంలోని కొత్తపట్నం, పెదబొండపల్లి, నర్సిపురం, హెచ్.కారాడవలస, చొక్కపువానివలస, వెంకంపేట, పుట్టూరు తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పడకేయడంతో ఆయా గ్రామస్తులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ప్రధాన వీధులతో పాటు, సందుల్లో కూడా మురుగు కాలువలు పూడికతో నిండిపోయి, మురుగునీరు ముందుకు సాగడం లేదు. రోజుల తరబడి నిలిచిన నీరు నల్లగా మారి, దుర్వాసన వెదజల్లుతోంది. ఈ మురుగు గుంటలే దోమలకు ప్రధాన ఆవాసాలుగా మారాయి. దీనికి తోడు, గ్రామంలో చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడంతో, ప్రజలు ఇళ్లలోని వ్యర్థాలను రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో పడేస్తున్నారు. ఈ చెత్తకుప్పలను పశువులు, పందులు చెల్లాచెదురు చేయడంతో వీధులన్నీ అపరిశుభ్రంగా తయారవుతున్నాయి.

దోమల దాడితో నిద్రలేని రాత్రులు



వర్షాకాలం కావడంతో సమస్య మరింత తీవ్ర రూపం దాల్చింది. నిలిచిన మురుగు నీటిలో, చెత్తకుప్పల వద్ద చేరిన వర్షపు నీటిలో ప్లాస్టిక్ వ్యర్థాలు తేలియాడుతూ దోమల ఉత్పత్తికి అనుకూలంగా మారాయి. సాయంత్రం అయితే చాలు, దోమల సైన్యం ఇళ్లపై దాడి చేస్తున్నాయి, చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ జర్వాల బారిన పడుతున్నారు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా సమస్య పరిష్కారం కావడం లేదు. మెరుగైన పారిశుద్ధ్య పనులు నిర్వహించడం లేదు. – ఉరిటి అప్పలనాయుడు , కొత్తపట్నం, పార్వతీపురం మండలం

రోగాలతో జాగ్రత్త

ఈ పరిస్థితుల వల్ల డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గ్రామాల్లో తక్షణమే పారిశుధ్య చర్యలు చేపట్టకపోతే, ప్రజారోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, కాలువల్లో పూడికను తొలగించి, చెత్తను తరలించి, దోమల నివారణకు బ్లీచింగ్, ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



వెంకంపేట మజ్జి గౌరి హౌసింగ్ కాలనీ ప్రారంభంలో చెత్త నిల్వలు



పెదబొండపల్లి సచివాలయం వీధిలో కాలువలో ముందుకు కదలని మురుగు

బడిదేవర కొండపై అధికారుల అబద్ధాలు

- రైతు సంఘం నాయకుల విమర్శ

పార్వతీపురం రూరల్: బడిదేవర కొండపై గ్రానైట్ మైనింగ్ అన్ని అనుమతులతోనే జరుగుతున్నట్లు మైనింగ్ జిల్లా అధికారి సెప్టెంబర్ 15న ప్రకటన విడుదల చేశారని, ఆ ప్రకటనలో ప్రభుత్వ అధికారులే తప్పులు చేసినట్లు అంగీకరించడం దారుణమని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి, గ్రామీణ ప్రజా సంఘం జిల్లా అధ్యక్షుడు బొత్స నరసింగరావు అన్నారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం కలెక్టరేట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. బడిదేవరకొండ తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా లైసెన్స్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఇదే పార్వతీపురం మండలంలో ఇటీవల ఎలుగుల మెట్టపై ప్రజాభిప్రాయసేకరణ చేసామని చెప్పిన మైనింగ్ అధికారి, బడిదేవరకొండపై కూడా ప్రజాభిప్రాయ సేకరణ చేశామని ఎందుకు చెప్పలేదని, అక్కడ ప్రజాభిప్రాయ సేకరణే చేయకుండా గ్రానైట్ లీజు లైసెన్స్ ఇచ్చారన్నారు. ఇప్పటికైనా అధికారులకు ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించే దమ్ముందా అని రైతు సంఘం నాయకులు సవాల్ విసిరారు. బడిదేవరకొండపై ఎక్కడ లైసెన్స్ ఇచ్చారో అక్కడ హద్దులు నిర్ణయించకుండా గ్రానైట్ తవ్వడానికి మైనింగ్ డిపార్ట్‌మెంట్ ఎలా అంగీకరిస్తుందని ప్రశ్నించారు. అది రిజర్వ్ ఫారెస్టులో ఉన్న ప్రభుత్వ భూమి అని, హద్దులు చూపమని ఫారెస్ట్ అధికారులు ఎంత మొత్తుకున్నా మైనింగ్ అధికారులు ఎందుకు పట్టించుకోలేదని వాపోయారు. మైనింగ్ తవ్వకాల వల్ల చెరువు కబ్జాకు గురికావడం పాడి బంగారి దొర అనే గిరిజనుడి మరణానికి కారణమైందని, కనీసం బంగారి దొర చనిపోయినా మైనింగ్ అధికారులు గ్రానైట్ లైసెన్స్ ఓనర్‌పై కేసు పెట్టి, అరెస్ట్ చేసి పత్రికలకు తెలియజేయకపోవడంపై మండిపడ్డారు.



కలక్టరెట్ వద్ద మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు ఎం.కృష్ణమూర్తి, బొత్స నరసింగరావు

బంగారి దొర కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి

గిరిజనులకు డి.పట్టాలు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చిన భూములను గ్రానైట్ మైనింగ్ కంపెనీ ఆక్రమించలేదని మైనింగ్ అధికారి సర్టిఫికెట్ ఇవ్వడంపై రెవెన్యూ, ఫారెస్ట్ అధికార్లు వచ్చి గిరిజనుల భూములు గ్రానైట్ కంపెనీ ఆక్రమించిందో తేల్చడంలో జాప్యం ఎందుకని నిలదీశారు. బంగారి దొర మరణానికి కారణమైన గ్రానైట్ మైనింగ్ యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని బంగారి దొర కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగాలు తొలగిస్తే పోరాడతాం

- గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి



పార్వతీపురం రూరల్: గిరిజన గర్భిణులకు గడిచిన ఏడేళ్లుగా వైద్య సేవలు అందిస్తున్న సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తే పోరాటం తప్పదని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్వతీపురంలోని కలెక్టరేట్ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ మారుమూల కొండకోన గిరిజన గ్రామాల్లో రహదారులు లేక గిరిజన గర్భిణులు ప్రసవ వేదనతో 'డోలీ' మోతలతో ఆస్పత్రికి చేరుకుంటున్న పరిస్థితుల్లో మృతిచెందుతున్న ఉదంతాల నేపథ్యంలో 2018లో అప్పటి పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, డాక్టర్ లక్ష్మీషా ఎంతో ముందుచూపుతో గుమ్మలక్ష్మీపురం, సాలూరు వైటీసీల్లో వాటిని ఏర్పాటు చేసి గిరిజన తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడాలని దేశంలో ఎక్కడా లేని విధంగా అద్భుతమైన ఆలోచన చేశారని రంజిత్ కుమార్ చెప్పారు. 'నీతి అయోగ్' కూడా ఈ చర్యలను ప్రశంసించిదని తెలిపారు. అలాగే సిబ్బంది జీతాలకు ఇబ్బంది లేకుండా కొంత డబ్బు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి నెల నెలా జీతాలు చెల్లించే వారని చెప్పారు. ఇప్పుడేమో పోస్టుల మంజూరు లేదు, ఐటీడీఏలో డబ్బులు లేవని సాకు చూపించి వారిని తొలగించాలనే నిర్ణయం చేయడం సరైంది కాదని రంజిత్ కుమార్ అన్నారు. ఇప్పటివరకు సుమారు పదివేల మంది గిరిజన తల్లీబిడ్డలను కాపాడిన సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగిస్తే వారి పక్షాన నిలిచి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన నాయకులు







మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన మాజీ డిప్యూటీ సీఎం రాజన్న దొర పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసనాయుడు

పార్వతీపురం రూరల్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం కలిశారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశం అనంతరం ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన పలువురు ముఖ్య నేతలతో పాటు పార్టీ అధినేతను మర్యాదపూర్వకంగా జోగారావు కలిశారు. ఈ సందర్భంగా జోగారావును ఆప్యాయంగా పలకరించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్వతీపురం నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ శ్రేణుల కార్యాచరణపై ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో ప్రజలు, కార్యకర్తలతో మమేకమై పార్టీ బలోపేతం కోసం మరింత పనిచేయాలని, వారికి అండగా నిలవాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు మాజీ ఎమ్మెల్యే జోగారావు చెప్పారు.

జగన్‌మోహన్ రెడ్డితో రాజన్నదొర

మక్కువ: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లి పార్టీ కార్యాలయంలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర, మక్కువ జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మావుడి శ్రీనివాసరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

అన్నపూర్ణ అలంకరణలో దుర్గాదేవి



సీతానగరం: అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

సీతానగరం: మండలంలో దేవీ నవరాత్రులను పురస్కరించుకుని మంటపాల్లో బుధవారం దుర్గాదేవి అన్నపూర్ణ అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు మండలకేంద్రంలోని అజ్జాడ బస్టాప్ దగ్గర గల వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో అన్నపూర్ణా దేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని పలువురు భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

యూరియా కోసం రైతుల పాట్లు

సాలూరు రూరల్: మండలంలోని రైతులు ప్రతిరోజూ యూరియా కోసం పరుగులు తీస్తున్నారు. ఎక్కడ యూరియా దొరుకుతుందోనని తెల్లవారిన దగ్గర నుంచి పొద్దుపోయేవరకు ఒక్క బస్తా యూరియా కోసం యాతన పడుతున్న రైతులు పరిస్థితి చూసిన ప్రతి ఒక్కరు ఇదేం దుస్థితిరా బాబూ అని ముక్కున వేలేసుకుంటున్నారు. మండలంలో ప్రతిరోజూ ఏదో ఒక సచివాలయంలో యూరియా పంపిణీ చేస్తున్నారు. అయితే రైతుకు మాత్రం సరిపడా యూరియా దొరకడం లేదు. ఒక రైతుకు ఒక బస్తా ఇస్తున్నారే తప్ప ఎంత అవసరమో అంత యూరియా మాత్రం ఇవ్వడం లేదు. బుధవారం కొత్తవలస, అన్నం రాజువలస, కరాసువలస, శివరాంపురం రైతు సేవా కేంద్రాల్లో ఒక రైతుకు ఒక బస్తా చొప్పున యూరియా అందజేశారు. తమకు సరిపడా యూరియా ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నానో యూరియాతో బహుళప్రయోజనాలు



మాట్లాడుతున్న ఏఓ ఎస్ అవినాష్

సీతానగరం: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించే పంటలకు నానో యూరియా వాడకం వల్ల బహుళ ప్రయోజనాలున్నాయని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు బుధవారం పణుకుపేటలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఏఓ అవినాష్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నానో యూరియా వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. సంప్రదాయ యూరియా కంటే నానో యూరియా ఎక్కువ ప్రభావవంతమైనదని అన్నారు. 500 ఎంఎల్ నానోయూరియా 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయడం వల్ల ప్రయోజనాలు కనిపిస్తాయని తెలియజేశారు. నేరుగా ఆకుల ద్వారా మొక్కకు పోషకాలు లభిస్తాయని, నానో యూరియా వాడకంతో పంటదిగుబడి పెరుగుతుందని చెప్పారు. భూమిలో నీటి కాలుష్యం తగ్గుతుందని, ఎక్కువ రోజులు ఆకులపై పత్రహరితం ఉంటుందని, తక్కువ ఖర్చుతో నికర ఆదాయం పంట ఉత్పత్తి, నాణ్యత పెరుగుతుందన్నారు. సరైన మోతాదులో వాడడం వల్ల రసం పీల్చుపురుగు ఉధృతి తగ్గుతుందని చెప్పారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై సీహెచ్‌సీలో అవగాహన



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాచిపెంట: సాలూరు పట్టణంలోని సీహెచ్‌సీలో ఆస్పత్రి సిబ్బంది, రోగులకు అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం అగ్నిమాపక సిబ్బంది అవగాహన నిర్వహించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటలు ఆర్పే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ప్రమాదాల నివారణపై, అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు.

కార్యక్రమంలో స్థానిక అగ్నిమాపక కేంద్రం ఎస్ఎఫ్ఓ కె.రాజారావు, ఎల్ ఎఫ్ పి.సీతం నాయుడు, ఆపరేటర్ ఎల్.మోహన్ రావు, ఫైర్‌మన్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పీ ఫోర్ సర్వే సమగ్రంగా నిర్వహించాలి



అవగాహన సదస్సులో పాల్గొన్న ఎంపీడీఓ ఆఫీస్ ఏఓ వెంకటరావు

సీతానగరం: గ్రామాల్లో పీఫోర్ సర్వేను నిర్దేశించిన గడువులోగా సమగ్రంగా నిర్వహించి బిలోపోవర్టీ కుటుంబాలకు సహకరించాలని ఎంపీడీఓ కార్యాలయం ఏఓ వెంకటరావు అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, డీఏలు, సచివాలయ ఉద్యోగులతో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఓటీలు కల్పిస్తున్న అవగాహన సదస్సును ఇనుమడించుకుని గ్రామాల్లో నిర్దేశించిన గడువులోగా సమర్థవంతంగా సర్వే జరగాలన్నారు. టీఓటీ గోవింద్ మాట్లాడుతూ నిర్దేశించిన గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వే పనులు నిర్దేశించిన ఫార్మాట్ పొందుపర్చిన ప్రకారం వివరాలను సేకరించి సర్వే చేయాలని సూచించారు. సర్వేలో ఎటువంటి తప్పులు రొర్లకుండా ముందు జాగ్రత్తచర్యలు తీసుకోవాలని, అర్థకాని వారు మరో పర్యాయం అవగాహనసదస్సుకు హాజరు కావాల్సి ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.


సొంతింటితో సామాజిక గౌరవం



మూలగూడలో పూర్తి చేసిన గృహాలను ప్రారంభిస్తున్న డైరెక్టర్ ప్రభుదాస్, లబ్ధిదారులు

- హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్

భామిని: సొంతిల్లు ఉన్నవారికి సామాజిక గౌరవం లభిస్తుందని హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ అన్నారు. ఈ మేరకు సంస్థ ఆర్థిక సహాయంతో మండలంలోని మూలగూడలో పూర్తి చేసుకున్న ఆరు గృహాలను లబ్ధిదారులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవసరమైన వారికి గృహ నిర్మాణాలకు ఆర్థిక సహాయం, నిర్మాణ సామగ్రి అందిస్తున్నట్లు చెప్పారు. మొదటి విడతగా 40 అసంపూర్తి గృహాలు పూర్తి చేసినట్లు సంస్థ ప్రతినిధులు కొండగొర్రి ప్రసాదరావు, బిడ్డిక చౌదరి వివరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ రజనీకాంత్, హౌసింగ్ సిబ్బంది, సంస్థ ప్రతినిధి కీర్తిరాయి సుగ్రీవులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



ప్రమాదపుటంచుల్లో తోటపల్లి కాలువ గట్లు



11.5వ కిలోమీటరువద్ద కాలువ గట్టునుంచి ప్రవహిస్తున్న నీరు

- ఆందోళనలో ప్రజలు

సీతానగరం: మండలంలోని తోటపల్లి ప్రాజెక్ట్ పరిధిలో కుడికాలువ గట్టును ఏడాదికాలంగా అభివృద్ధి చేయకపోవడంతో పలుచోట్ల గండ్లు పడే అవకాశం ఉందని, ప్రమాదపు టంచుల్లో ఉన్నామని ఆయాగ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తోటపల్లి ప్రాజెక్ట్‌కు సంబంధించిన కుడి కాలువపై నీలకంఠాపురం దరి 11.5వ కిలోమీటరు, ఇప్పలవలస దత్తిలో 12.8వకిలోమీటరు, ఏగోటివలస సమీపంలో 18.2వ కిలోమీటరు వద్ద ఒకే గట్టుకు మూడు కాలువ గట్ల మీదనుంచి నీరు ప్రవహిస్తున్న కారణంగా ఏక్షణంలోనైనా గండి పడే ఆస్కారం ఉందని ఆయా గ్రామాల ప్రజలు, ఆయకట్టు దారులు ఆందోళన చెందుతున్నారు. గరుగుబిల్లి మండలం ఉల్లి భద్రలో ఉన్న తోటపల్లి సాగు నీటి ప్రాజెక్ట్ ద్వారా 4 నియోజకవర్గాలకు చెందిన 1.25 లక్షల ఎకరాల విస్తీర్ణానికి సాగు నీరందించడానికి పనులు జరిగాయి. కాలువలో పుష్కలంగా నీరు ప్రవహిస్తోంది. వర్షాలు కురుస్తున్న కారణంగా నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కాలువకు గండి పడడం ఖాయమని రైతులు వాపోతున్నారు. అక్కడక్కడా కాలువకు మట్టి గట్లు వేసినా వర్షానికి బరద మయమయ్యాయని చెబుతున్నారు. ప్రజలు భయాందోళన చెందుతు న్నా కూటమి ప్రభుత్వం పట్టించు కోలేదని ఆయాగ్రామాల ప్రజలు, పంటలు సాగు చేస్తున్న రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాలువనిండా నీరు ప్రవహించడంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందోనని వాపోతున్నారు.

కాలువకు ప్రతి ఏటా మెయింటనెన్స్ చేయాల్సిన వారు 2024-25 ఆర్థిక సంవత్సరంలో కాలువ గట్టు అభివృద్ధి పనులు చేయకపోవడం వల్ల కష్టాలు మొదలయ్యాయని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రాంతాలను పరిశీలించి ముందు జాగ్రత్తచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నీలకంఠాపురం వద్ద కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగిస్తున్నందున పూర్తిస్థాయిలో పనులు జరగాలని కోరుతున్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కొమరాడ: మహిళల ఆరోగ్యం కోసం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి ఎస్.భాస్కరరావు అన్నారు. మండలంలోని విక్రమపురంలో బుధవారం నిర్వహించిన ఆరోగ్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గర్భిణులు, వృద్ధులతో మాట్లాడుతూ.. అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2 వరకు జిల్లా వ్యాప్తంగా 339 వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాల్లో బీపీ, సుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, రక్తహీనత, పోష్టికాహార లోపాలు గుర్తించడం వంటివి చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు, వైద్యులు దేవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.